Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 152 | మంగళవారం 11 నవంబరు 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

IRS PUBLICATIONS
irspublications12@gmail.com



ఎర్రకోట సమీపంలో

## భారీ పేలుడు

- ❖ మెట్రో స్టేషన్ వద్ద పార్కింగ్ చేసిన కారులో విస్ఫోటనం
- ❖ బ్లాస్టింగ్ ధాటికి ఛిద్రమైన శరీరాలు, పలు వాహనాలు దగ్ధం
- ❖ ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు
- ❖ మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- ❖ ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా హై అలర్ట్
- ❖ ఎర్రకోట చాందినీ చౌక్ దారులు మూసివేత : సిపి

**న్యూఢిల్లీ , సూర్యవాస్తవం:** దేశ రాజధాని ఢిల్లీ పేలుడుతో దద్దరిల్లింది. ఎర్రకోట సమీపంలో పార్క్ చేసిన కారులో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 9 మంది మృతి చెందారు. గాయపడిన 24 మందిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యవర్గాలు తెలిపాయి. పేలుడు ధాటికి పలువురి శరీరాలు ఛిద్రమయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో భీతావహ దృశ్యాలు అక్కడివారిని కలిచివేశాయి. మరోపక్క మృతుల సంఖ్య మరింతగా పెరిగే - మిగతా 2లో..



ప్రధాని మోదీ పర్యటనకు

# పటిష్ట ఏర్పాట్లు

- ❖ సత్యసాయి మహాసమాధి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించండి
- ❖ సత్యసాయిబాబా శత జయంతి వేడులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి, సూర్యవాస్తవం:** శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 19న పుట్టపర్తికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, 22వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్మ రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రపతి సహా వివిధ ప్రముఖులు హాజరుకానున్న దృష్ట్యా - మిగతా 2లో..

## అన్ని విద్యాసంస్థల్లో వందేమాతరం తప్పనిసరి

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్



లక్నో సూర్యవాస్తవం: ఉత్తరప్రదేశ్‌లో అన్ని విద్యాసంస్థల్లో వందేమాతరం గేయాలాపనను తప్పనిసరి చేస్తున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం ప్రకటించారు. గోరఖ్‌పూర్‌లో 'ఏక్తా యాత్ర' పేరుతో నిర్వహించిన సామూహిక వందేమాతరం గేయాలాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. విద్యాసంస్థల్లో జాతీయ గీతాలాపన చేయడం వల్ల విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే దానిపై గౌరవం, దేశభక్తి ఏర్పడుతాయని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి నవంబర్ 7తో 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏడాది పొడవునా స్మారకోత్సవాలు జరపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వందేమాతరం గేయాలాపన నిర్వహిం చడం జరిగిందని ఆయన అన్నారు. కాగా ఈ గేయాన్ని 1875 నవంబర్ 7న బకించంద్ర ఛటర్జి రాశారు.

## రెండేళ్ల కాలానికి జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు

మీడియా రిలేషన్ పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి పార్థసారధి

**అమరావతి, సూర్యవాస్తవం:** వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు 2026-27 సంవత్సరాలకు అక్రిడిటేషన్లు జారీ చేసేందుకు సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన మీడియా రిలేషన్స్ పోర్టల్‌ను - మిగతా 2లో..



బీహార్‌లో తుది సంగ్రామం

## నేడు రెండోదశ పోలింగ్

- 122 నియోజకవర్గాల్లో ఓటింగ్‌కు సర్వం సిద్ధం
- 1302 మంది అభ్యర్థులు
- 3.7 కోట్ల మంది ఓటర్లు
- విధుల్లో 4 లక్షల మంది : ఎన్నికల సంఘం



- మిగతా 2లో..

# దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వండి

## 150 వసంతాల వందేమాతరం'లో ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ సూర్యవాస్తవం:** వందేమాతరం స్ఫూర్తితో దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా స్థానిక తుమ్మలపల్లికళాక్షేత్రంలో 150 వసంతాల వందేమాతరం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఆయన తలకించారు. అనంతరం వందేమాతర గేయ రచయిత బక్రించంద్ర ఛటర్జీ, తెలుగులో మొదటి నిఘంటువు సృష్టి కర్త సిపి బ్రౌన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ళ మల్లికార్జునరావు రచించిన వందేమాతరం పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. - మిగతా 2లో..



నేడు పెనుగొండ, హిందూపురం పారిశ్రామిక వాడల్లో

## పరిశ్రమలకు భూమి పూజ

జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్



**పుట్టపర్తి, పబ్లిక్ టుడే:** 30వ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు - 2025 లో భాగంగా... ఈనెల 11న పెనుగొండ, హిందూపూర్ పారిశ్రామిక వాడలలో పరిశ్రమలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చే వర్చువల్ గా భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ సోమవారం తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉదయం 10.30 గంటలకు ప్రకాశం జిల్లా కనిగిరిలో 30వ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు - 2025 ప్రోగ్రాం ప్రారంభించటంజరుగుతుందని, ఈ సందర్భంగా అక్కడి నుండి వర్చువల్ గా అనేక నూతన పరిశ్రమలకు సంబందించి భూమి పూజ మరియు ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టడం జరుగుతోం దన్నారు. ఇందులో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండ నియోజక వర్గంలోని అమ్మవారి - మిగతా 2లో..

తొలిసారి గెలిచిన

# ఎమ్మెల్యేలకు అవగాహన అవసరం

## టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్



**అమరావతి, సూర్యవాస్తవం:** తొలిసారి ఎన్నికల్లో గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలు తమ పాత్ర, బాధ్యతలను పూర్తిగా అర్థం చేసుకోలేదని, వారు ఇంకా రాజకీయ అనుభవం లేని వారనీ, సమన్వయ దృఢత్వం లేదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్ అన్నారు. అవగాహన లోపం కారణంగా, కొత్త ఎమ్మెల్యేలు తమ జాబితాలో ఉన్న సీనియర్ నేతల సహాయం తీసుకోవడం చాలా అవసరం అని సూచించారు. ఎమ్మెల్యేగానే గెలిచిన తర్వాత ఎదురైన సమస్యలను, ఆవశ్యకమైన మార్గాలను తెలుసుకునే ఆవశ్యకత ఉంది అని చెప్పారు. మంత్రి లోకేష్ సోమవారం ప్రభుత్వ కార్యాలయంలో సీనియర్ నేతలు, మంత్రులతో సమావేశమయ్యారు. వారితో మాట్లాడుతూ కొత్త - మిగతా 2లో..

## నేడు పెనుగొండ, హిందూపురం పారిశ్రామిక వాడల్లో
# పరిశ్రమలకు భూమి పూజ

(మొదటి పేజీ తరువాయి)
పల్లి పారిశ్రామిక వాడలో పిహెచ్‌ఏ (పి హెచ్ ఏ)ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నందు మరియు హిందూపూర్ నియోజగవర్గంలోని తూమ కుంట పారిశ్రామిక వాడలోని హెచ్.టి.ఎల్ (హెచ్ టి ఎల్) మెటల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల యందు భూమి పూజ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. పెనుకొండ నియోజకవర్గ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి. కే పార్థ సారథి, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎర్రకోట సమీపంలో
# భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)
అవకాశముందని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. సంఘటనా స్థలానికి నేషనల్ సేక్యూరిటీ గార్డ్ ( ఎన్ఎస్‌జి ), ఫోరెన్సిక్ ( ఎఫ్ఎస్ఎల్) బృందాలు చేరుకుని దర్యాప్తు ప్రారంభిం చాయి. ఎర్రకోట చాందినీచౌక్ దారులను మూసి వేసినట్టు సీపీ వెల్లడించారు. వియానాశ్ర యాలు, మెట్రో, చారిత్రక కట్టడాలు, ప్రభుత్వ భవనాలతో సహా ఢిల్లీ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్ఎఫ్) దేశ వ్యాప్తంగా హై అలెర్ట్ జారీ చేసింది.. ఢిల్లీ మెట్రోస్టేషన్ గేట్ నెంబర్-1 వద్ద వాహనాలు పార్కింగ్ వద్ద సాయంత్రం 6.52 గంటల సమయంలో అక్కడి రెండు కార్లలో అమర్చిన పేలుడు పదార్థాలు భారీ శబ్దాలతో పేలాయి. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం ఉలిక్కిపడింది. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే మంటలు ఎగిసిపడ్డాయి. ఆ పక్కనే ఉన్న అనేక వాహనాలు మంటలధాటికి తునాతునకలయ్యాయి. పేలుళ్లతో ఘటనాస్థలిలో ఉన్న ప్రజలు తమ ప్రాణాలు కాపాడుకు నేందుకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులతో పాటు అగ్నిమాపక దళాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. ఏడు ఫైర్ ఇంజిన్లు వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో ఆఘమేఘాలపై మరిన్ని అగ్నిమాపక వాహనాలను తెప్పించారు. పేలుళ్లపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఢిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. ఘటనాస్థలికి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ), నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ), ఫోరెన్సిక్ బృందాలు రంగంలోకి దిగి దర్యాప్తును ముమ్మరం చేశాయి.
పేలుళ్లలో గాయపడిన క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో వైద్య సేవలు కొనసాగుతున్నాయి. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు.

**ఢిల్లీ సహా పలు నగరాల్లో హైఅలర్ట్**

ఢిల్లీ మెట్రోస్టేషన్ వద్ద భీతావహ పరిస్థితిని చూస్తే ఇది పకడ్బందీగా జరిగిన దాడిలా కనిపిస్తోంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పరిస్థితి గందరగోళంగా మారటంతో.. ఢిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. కార్లు, ఆటోలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. షాపులు, భవనాలు ధ్వంసం అయ్యాయి. అయితే ప్రతి సోమవారం ఢిల్లీలోని పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లకు సెలవు. అందువల్ల ప్రమాదం తీవ్రత, ప్రాణ నష్టం కాస్త తగ్గిందని తెలుస్తోంది. హైదరాబాద్‌లో.. ఢిల్లీ పేలుళ్ల ఘటనతో హైదరాబాద్‌తో సహా పలు నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. దీంతో హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమై పాతబస్తీలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని అన్ని మతపరమైన ప్రదేశాలు, సరిహద్దు ప్రాంతాల్లోనూ భద్రత పెంచాలని ఆదేశాలు జారీ చేసినట్టు ఆ రాష్ట్ర డీజీపీ తెలిపారు. సున్నితమైన ప్రాంతాల్లో గస్తీ, తనిఖీలు పెంచాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

# రెండేళ్ల కాలానికి జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు

(మొదటి పేజీ తరువాయి)
సచివాలయంలో సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి సోమవారం ప్రారంభించారు. గతంలో జారీ చేసిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు ఈ నెల 30తో ముగియనున్న నేపథ్యంలో నూతన అక్రిడిటేషన్లు జారీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐఅండ్‌పిఆర్ కమిషనరు విశ్వనాథ్ పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్‌కు అర్హులైన మీడియా ప్రతినిధులందరూ ఈ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులు తమ అప్లికేషన్ స్టేటస్ ఏ దశలో ఉందో ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ పోర్టల్‌లో ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలనే విధి విధానాలను మంగళవారం విడుదల చేస్తామన్నారు



# ప్రధాని మోదీ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)
ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సత్యసాయిబాబా జయంతి వేడుకల నిర్వహణపై సచివాలయంలో మంత్రులు, సీఎస్ విజయానంద్, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పుట్టపర్తికి ప్రముఖులు రానున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, పట్టణాన్ని సుందరంగా అలంకరించాలని సీఎం సూచించారు. ఏర్పాట్ల పర్యవేక్షించేందుకు మంత్రుల కమిటీ పుట్టపర్తిలో పర్యటించాలని ఆదేశించారు. శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు.

**భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయండి...**

సత్యసాయిబాబా మహాసమాధి దర్శన నిమిత్తం పుట్టపర్తి నిలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. వచ్చే వాహనాలకు పార్కింగ్‌తో పాటు పట్టణంలో రాకపోకల ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. బాబా మహాసమాధి దర్శనానికి ఎంత మంది భక్తులు రావచ్చనేదానిపై అంచనా వేసి అందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల కోసం అవసరమైన మేరకు ఆర్టీసీ బస్సులను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ముందుస్తు జాగ్రత్తగా మెడికల్ క్యాంపులు సైతం ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. పుట్టపర్తిలోని వేర్వేరు ప్రాంతాల్లో 10 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు సీఎంకు తెలియజేశారు. పారిశుద్ధ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**10 రోజులు 682 రైళ్లు...**

పుట్టపర్తికి వచ్చే భక్తులకు చిన్నపాటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు సీఎంకు వివరించారు.

పారిశుద్ధ్యం నిర్వహణకు 250 మంది సిబ్బంది, వచ్చే భక్తులకు తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు వంటి సదుపాయాలను కల్పిస్తున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు. జయంతి వేడుకల నేపథ్యంలో 65 ప్రత్యేక రైళ్లతో పాటు ఈనెల 13వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు 682 రైళ్లు పుట్టపర్తికి రైల్వే శాఖ నడుతోందని వివరించారు. పుట్టపర్తి బస్ స్టేషన్ నుంచి రైల్వే స్టేషన్‌కు రోజుకు 20 బస్సులు భక్తుల రవాణా కోసం ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. సమీక్షలో మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్, అధికారులు పాల్గొన్నారు.

## బీహార్‌లో తుది సంగ్రామం
# నేడు రెండోదశ పోలింగ్

**రాంచీ , సూర్యవాస్తవం: :** బీహార్ అసెంబ్లీ రెండోదశ ఎన్నికల సంగ్రామం తుది దశకు చేరుకుంది. 20 జిల్లాల్లోని 122 నియోజక వర్గాల్లో మంగళవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగనుంది. 3 కోట్లా 70 లక్షల మంది ఓటర్ల కోసం ఎన్నికల కమిషన్ 45,399 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో 40,073 పోలింగ్ బూత్‌లు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఎన్నికల విధుల్లో నాలుగు లక్షల మంది సిబ్బంది పాల్గొంటున్నట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. మొత్తం 1,302 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు తేల్చనున్నారు. రాష్ట్రంలోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకుగానూ మెజారిటీ స్థానాల్లో జరుగుతున్న రెండోవిడత పోల్‌పైనే అందరి దృష్టి నెలకొని ఉంది.
బరిలో 1,165 మంది పురుషులు, 136 మంది మహిళలు
రెండో విడత పోలింగ్ జరగనున్న 122 అసెంబ్లీ స్థానాల్లో 101 జనరల్ సీట్లు, 19 ఎస్‌సి రిజర్వ్‌డ్ సీట్లు, 2 ఎస్‌టి రిజర్వ్‌డ్ సీట్లు ఉన్నాయి. ఈ స్థానాల్లో మొత్తం 1,761 నామినేషన్లు దాఖలవగా, 1,372 నామినేషన్లే చెల్లుబాటయ్యాయి. వీరిలో 70 మంది అభ్యర్థులు నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ఎన్నికల బరిలో 1,302 మంది మిగిలారు. వీరిలో 1,165 మంది పురుషులు, 136 మంది మహిళలు, ఒకరు థర్డ్ జెండర్ అభ్యర్థి. మొత్తం అభ్యర్థుల్లో దాదాపు 10 శాతం మంది మహిళలు ఉన్నారు. వనితలకు ఆర్‌జెడి 13, జన్ సురాజ్ 12, బిజెపి 10, జెడియు 9, కాంగ్రెస్ 2 టికెట్లు ఇచ్చాయి.
ఏ పార్టీ నుంచి ఎంతమంది అభ్యర్థులు ?
బిజెపి : 53, జెడియు : 44, ఆర్‌జెడి : 71, కాంగ్రెస్ : 37, జన్ సురాజ్ : 120, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి): 7, సిపిఐ (ఎంఎల్-ఎల్): 6, సిపిఐ(ఎం) 4, ఎల్‌జెపి (రామ్ విలాస్): 15, స్వతంత్రులు: 462, ఇతరులు : 487,
స్వతంత్రులు, చిన్న పార్టీల అభ్యర్థులే ఎక్కువ
తుది విడత పోలింగ్ జరిగే 122 అసెంబ్లీ స్థానాల్లో 462 మంది స్వతంత్ర అభ్యర్థులు, 487 మంది ఇతరులు (చిన్న పార్టీలు) పోటీ చేస్తున్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో సగటున 11 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. బీహార్‌లోని ప్రధానమైన రాజకీయ పార్టీలు బిజెపి, జెడియు, ఆర్‌జెడి, కాంగ్రెస్, జన్ సురాజ్, విఐపి, వామపక్షాలు, ఎల్‌జెపి (రామ్ విలాస్) మాత్రమే. ఆసక్తికరంగా రెండోవిడత పోలింగ్ బరిలో ఏకంగా 109 రాజకీయ పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి టికెట్లు ఆశించి భంగపడిన నేతల్లో కొందరు చిన్న పార్టీల తరఫున ఎన్నికల బరిలోకి దిగారు. మరికొందరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.
**పాట్నా :** ఆర్‌జెడి నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ బీహార్‌లో 'ఓట్ల చోరీ, వంచన'ను సహించదని ఆర్‌జెడి నేత, ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ స్పష్టం చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన బీహార్‌లో మొదటిదశ పోలింగ్ జరిగి నాలుగు రోజులైనా 'జెండర్ వైజ్ (స్త్రీ, పురుషులు, థర్డ్ జెండర్ ఓటర్ల) డేటా'ను ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒత్తిళ్లతో ఇసి సక్రమంగా తన విధులు నిర్వహించడం లేదని విమర్శించారు.

అమిత్ షాతో ఇసి కుమ్మక్కై సమస్యలు సృష్టించడానికి ప్రయత్నిస్తే, అధికారులు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని ఆయన హెచ్చరించారు. "బిజెపి పాలిత రాష్ట్రాల నుంచి మొత్తం 208 కంపెనీల భద్రతా సిబ్బందిని బీహార్ ఎన్నికల విధుల కోసం మోహరించారు. మేం వారిపై నిఘా ఉంచుతున్నాం. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సహా బయటి వ్యక్తులు బీహార్‌ను నియంత్రించాలని అనుకుంటున్నారు. దీనిని బీహార్ ప్రజలు అనుమతించరు" అని తేజస్వియాదవ్ అన్నారు. "మోడీ తన ఎన్నికల ప్రచారంలో బీహార్‌లోని నిరుద్యోగం, వలసలు వంటి సమస్యలపై మాట్లాడలేదు. కేవలం కుటిల రాజకీయాలు మాత్రమే చేశారు" అని విమర్శించారు. బీహార్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని, ఈ నెల 18న ప్రమాణ స్వీకారం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడేది లేదని, మహాఘట్‌బంధన్ బీహార్ ఎన్నికల్లో గెలిస్తే నేరస్థులు, మతతత్వ శక్తులు, అవినీతి పరులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వండి

(మొదటి పేజీ తరువాయి)
ప్రజలతో కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వందేమాతరం గేయం అందరినీ ఏకతాటిపైకి తెచ్చిందని, స్వాంతంత్ర్యోద్యమ సంగ్రామంలో జాతీయ భావాన్ని రగిలించిందన్నారు. విశిష్టమైన ఈ గేయాన్ని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఓ వైపు మేకిన్ ఇండియా కార్యక్రమాలు, మరోవైపు యోగా వంటి కార్యక్రమాలు దేశ కీర్తిని ప్రపంచం మొత్తం చాటాయన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మారుస్తామని తెలిపారు. దేశం తనకేమి ఇచ్చిందని కాకుండా దేశానికి తానేం చేశానని ప్రతి ఒక్కరూ ఆలోచిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, ఎపి సృజనాత్మకత సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వినీ, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజరు జైన్, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ ఆర్‌డిఒ కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## తొలిసారి గెలిచిన
# ఎమ్మెల్యేలకు అవగాహన అవసరం

(మొదటి పేజీ తరువాయి)
ఎమ్మెల్యేలకు ఈ విషయాలపై అవగాహన కల్పించుకోవడం ముఖ్యమని సూచించారు. ఇక, ఈ నెల 14, 15 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహించనున్న పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు అత్యంత విజయవంతంగా నిర్వహించడమే కాకుండా, ఆర్థిక వ్యవస్థకు పుష్కలంగా పెట్టుబడులు తేవాలని లోకేష్ పిలుపునిచ్చారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రావొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి మంత్రికి తమ శాఖలోని ఒప్పందాలపై బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని, వారు తమ జిల్లాల్లో సంస్థల స్థాపనకు ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. 20 లక్షల ఉద్యోగాల హామీ నెరవేర్పు కోసం కలిసి చేయాలి అని లోకేష్ అన్నారు.

# సంపాదకీయం

## చావొక్కటే.. అన్నింటికీ పరిష్కారం కాదు

జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా ఎదుర్కోవాలి! ఎవరి జీవితం కూడా పూల పాన్పు కాదు. ఈ డైలాగ్‌ని.. మన జీవితంలో ఎప్పుడో ఒకసారి వినే ఉంటాం. ఎక్కడో ఓ చోట చదివే ఉంటాం. లైఫ్ అంటే.. ఎప్పుడూ సుఖంగా, అన్ని రోజులూ సంతోషంగా ఉండదని తెలుసు. కష్టాలు, సుఖాలు, సవాళ్లు, సమస్యలు.. అందరికీ ఉంటాయ్. ఇవన్నీ.. ఏదో ఒక ఫేజ్‌లో ఎదుర్కోక తప్పదు. అయినా సరే.. జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా.. ఎదుర్కోవాలి. వాటన్నింటిని ధైర్యంగా దాటుకొని.. ముందుకు సాగాలి. కానీ.. ఈరోజులు అలా లేవు. కాలం మారేకొద్దీ.. పబ్లిక్ మరింత వీక్‌గా తయారవుతున్నారు. చిన్న చిన్న విషయాలకే.. చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటున్నారు. తనువు చాలిస్తున్నారు. సమస్య వస్తే చాలు.. దాన్ని ఎదుర్కోలేక చచ్చిపోతున్నారు. ఇటీవలి కాలంలో చిన్నా, పెద్ద, యువత, ముసలి, ముతకా అనే తేడా లేదు. అందరిదీ అదేదారి. ఎంతో అందమైన జీవితాన్ని గెలవలేక.. అర్ధాంతరంగా చనిపోతున్నారు. అసలు.. ఓ చిన్న సమస్యని కూడా ఎదుర్కొనే ధైర్యం లేకుండా ఎలా ఉంటున్నారు? దేనినైనా తట్టుకోగలిగే, ఎదుర్కోగలిగే ఆత్మవిశ్వాసం ఏమైపోయిందనే ప్రశ్నలే.. ఇప్పుడు అందరిలోనూ తలెత్తుతున్నాయ్. సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో విశాఖలో యువకుడు ఆత్మహత్య సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో.. తల్లిదండ్రులను మోసం చేశాననే మనస్తాపంతో విశాఖలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొబ్బరితోట ఏరియాలో ఓ గదిని అద్దెకు తీసుకొని.. హీలియం గ్యాస్‌తో ముఖానికి కవర్ తగిలించుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు..మళ్లీ పాస్ అయ్యే చాన్స్ ఉంటుంది హైదరాబాద్‌లో రెండేళ్ల కూతురితో తల్లి ఆత్మహత్య హైదరాబాద్‌లో కుటుంబ కలహాలతో.. హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది కీర్తిక అగర్వాల్. తనతో పాటు రెండేళ్ల చిన్నారి ప్రాణాన్ని కూడా తీసుకెళ్లిపోయింది. ఫ్యామిలీలో గొడవలున్నంత మాత్రాన, భర్తతో మనస్పర్థలు వచ్చినంతమాత్రాన.. చావే పరిష్కారమా? అంతగాఇబ్బందిఉంటే.. పెద్దవాళ్లను కూర్చోబెట్టి మాట్లాడటమో, కౌన్సిలింగ్ తీసుకోవడమో చేయాలి గానీ.. ఇలా ప్రాణాలు తీసుకోవడమేంటి? చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఎందుకొస్తోంది? అనేదే.. ఎవ్వరికీ అంతుబట్టడం లేదు. తిరుపతిలో ఇంజనీరింగ్ చదువుతున్న 20 ఏళ్ల చందు అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లాలో.. తొర్రేడు తిరుమల కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఎల్ల సత్యదేవకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్‌లో తండ్రి దించి వెళ్లిన కొన్ని గంటల్లోనే.. సూసైడ్ చేసుకున్నాడు. హాస్టల్‌లో ఉండనని, ఇంటి దగ్గరే ఉండి చదువుకుంటానని మారాం చేశాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో.. ఆత్మహత్యే శరణ్యం అనుకున్నాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోతే.. వారిని ఒప్పించే ప్రయత్నం చేయాలి. కూర్చోబెట్టి నచ్చజెప్పాలి. ఒకసారి కాకపోయినా.. మరోసారి వింటారు. కానీ.. హాస్టల్లోనే ఉండమన్నారనే బాధతో ప్రాణాలు తీసుకోవడమేంటి? చిత్తూరు జిల్లా సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ సూసైడ్ చిత్తూరు జిల్లాలో సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడో అంతస్తు నుంచి దూకి చనిపోయాడు. కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిలిస్తున్నారు. ప్రతి ప్రశ్నకు సమాధానం ఉన్నట్లే.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. ప్రతి చీకటి వెనుక.. ఓ వెలుగు రేఖ దాగి ఉంటుంది. సమస్య ఎలాంటిదైనా.. పరిష్కారం ఓపిగ్గా ఆలోచించి వెతుక్కోవాల్సింది మనమే. సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొని.. జీవితాన్ని గెలవాల్సిందే! కానీ.. దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న ఆత్మహత్యల పరంపర చూస్తుంటే.. సమాజం ఎటు వైపు పోతుందోనన్న భయం కలుగుతోంది. ప్రతి ఒక్కరూ.. చావే పరిష్కారమనే మూర్ఖపు ఆలోచనల నుంచి బయటకు రాకపోవడమే.. గుండెల్ని పిండేస్తోంది. ఇప్పటికే ఉన్న ఆత్మహత్యల ఆందోళనల్ని మరింత పెంచుతోంది. మరి.. దీనికేంటి పరిష్కారం? చాలా మందిలో సన్నగిల్లుతున్న ఆత్మవిశ్వాసం కారణాలు ఏవైనా కావొచ్చు.. సమస్య ఎలాంటిదైనా ఉండొచ్చు.. కానీ.. తీరిగ్గా ఆలోచిస్తే ప్రతి ప్రాబ్లమ్‌కి.. కచ్చితంగా సొల్యూషన్ దొరుకుతుంది. కానీ.. ఏదైనా సమస్య వస్తే.. దాన్ని తట్టుకునేంత ఆత్మవిశ్వాసం చాలా మందిలో సన్నగిల్లుతోంది. వరుస ఆత్మహత్యల్ని చూశాక.. అర్థమవుతున్నది ఇదే. మార్కులు తక్కువొచ్చాయని, ఎగ్జామ్‌లో ఫెయిలయ్యామని, ప్రేమలో విఫలమయ్యామని, ఆర్థికంగా నష్టపోయామని, సోషల్ మీడియాలో ట్రోల్స్, కుటుంబ కలహాలు, వేధింపులు.. ఇలా చెప్పుకుంటూ పోతే.. అనేక కారణాలున్నాయ్. జీవితంలో భాగంగా ఎదురయ్యే చిన్న ఫెయిల్యూర్‌కి కూడా.. జీవితమే అంతమైపోయినట్లు భావిస్తున్నారు. ప్రతి సమస్యకు.. ఇన్‌స్టంట్ రిలీఫ్ కావాలి. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా.. వెంటనే పరిష్కారం దొరికేయాలనుకుంటారు. సొల్యూషన్ కాస్త లేటైనా.. లైఫ్ ఎండింగ్ డెసిషన్ తీసేసుకుంటున్నారు. ఇతరుల జీవితాలతో పోల్చుకుంటూ.. తాము ఎందుకూ పనికిరామని నిరాశ చెందుతున్నారు. మిగతా వాళ్లలా.. తమ లైఫ్ ఎందుకు లేదని బాధపడుతుంటారే తప్ప.. వారి స్థాయికి ఎదగాలని అనుకోవడం లేదు. ఈ సోషల్ కంపారిజన్స్ కూడా.. సూసైడ్స్‌కి ఓ రీజన్‌గా కనిపిస్తోంది. చాలా మంది తమ సమస్యలకు పరిష్కారంపై దృష్టి పెట్టకుండా.. ఇతరులతో పంచుకోకుండా.. వాళ్లకు వాళ్లే కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎంతోమందిపై.. వారు పెరిగిన కుటుంబ, సామాజిక వాతావరణం కూడా ప్రభావం చూపుతోంది. పిల్లల మార్కుల కోసం, ర్యాంకుల కోసం పేరెంట్స్ చేసే ప్రెజర్‌ని తట్టుకోలేని వాళ్లు చాలా మంది ఉంటున్నారు. వారు.. తమ తల్లిదండ్రుల ఆశల్ని అందుకోలేకపోయినప్పుడు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇక.. కుటుంబంలో ఉండే వాతావరణం కూడా వారి జీవితాలపై ప్రభావం చూపుతోంది. తమ సమస్యలు పంచుకునే వాతావరణం లేకపోవడం, ఒంటరితనం పెరగడం లాంటివి.. తనువు చాలించాలనే నిర్ణయాలకు దారి చూపుతున్నాయ్. ఆత్మహత్య.. ఎప్పటికీ సమస్యకు పరిష్కారం కాదు. పైగా.. అది ఎవరూ పరిష్కరించలేని మరో సమస్యని సృష్టిస్తుంది. తమనే నమ్ముకున్న వారి జీవితాలను ప్రశ్నార్థకం చేస్తుంది. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి బాధ అక్కడితో అంతమవుతుంది. కానీ.. ఆ బాధ మొత్తం కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు వారసత్వంగా మిగులుతుంది. ఇది.. మిగతా వారి జీవితాలపై ప్రభావం చూపుతుంది. జీవితమనేది.. ఆ భగవంతుడు ఇచ్చిన బహుమతి. జీవితమనేది.. లైఫ్ జర్నీలో ఎదురయ్యే సంఘటనలతో అనుభవాలని నేర్చుకునేందుకు, అప్పుడప్పుడు వచ్చే సమస్యలను అధిగమించేందుకు.. ఓ చక్కని అవకాశం. ప్రతి సమస్య ఓ పాఠాన్ని నేర్పుతుంది. చచ్చేంత ధైర్యం.. బతకడానికి ఎందుకు లేదనే ప్రశ్న కూడా ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉంటుంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉంటుంది. అదే ధైర్యాన్ని.. జీవితంలో ఎదురయ్యే సవాళ్లని ఎదుర్కొనేందుకు, పోరాడేందుకు ఉపయోగిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోతాయ్. జీవితంలో ఎదురయ్యే కష్టాలకు ముగింపు ఆత్మహత్య కాదు.. సమస్యలున్నోళ్లు ఎవరైనా ఆలోచించాల్సింది.. ఆత్మహత్యలు ఎలా చేసుకోవాలని కాదు. సమస్య నుంచి పారిపోవడం కాదు.. పోరాడటం నేర్చుకోవాలి. ఓటమే.. అంతం అనుకోవద్దు. అదొక పాఠంగా భావించాలి.

# రాళ్లవాగులో వజ్రాల వేట



**కర్నూలు, సూర్య వాస్తవం, నవంబర్ 10:** వర్షాకాలం ప్రారంభం అయితే చాలు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాల్లో వజ్రాల వేట మొదలవుతుంది. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఎక్కడెక్కడి నుంచో జనాలు తరలి వస్తుంటారు. రోజుల తరబడి పొలాల్లో కూర్చుని వజ్రాల కోసం గాలిస్తుంటారు. ప్రతి సంవత్సరం కొందరికైనా వజ్రాలు దక్కుతాయి. దక్కని వారు.. వచ్చే సంవత్సరం చూసుకుందాం అని వెళ్లిపోతారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో ప్రాంతం చేరింది. అక్కడ వజ్రాలు దొరుకుతున్నాయంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతుండటంతో.. జనాలు తండోపతండాలుగా అక్కడకు తరలి వస్తున్నారు. మరి నిజంగానే అక్కడ వజ్రాలు దొరుకుతున్నాయా అంటే..ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అడవిలో పారే రాళ్లవాగు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇక్కడ వజ్రాలు దొరుకుతున్నాయంటూ ప్రచారం సాగుతుండటంతో.. రాళ్ల వాగు కాస్త వజ్రాల వాగుగా మారింది. మరి నిజంగానే ఇక్కడ వజ్రాలు దొరుకుతున్నాయా అంటే.. ఇప్పటి వరకు డైమండ్స్ దొరికిన వాళ్లు ఒక్కరు కూడా లేదు. కానీ సోషల్ మీడియాలో ప్రచారం చూసి స్థానిక ప్రాంత ప్రజలు, పేదలు, కూలీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడం కోసం రాళ్ల వాగు వద్దకు తరలి వస్తున్నారు. ఈ వాగులో వజ్రాల కోసం వేట కొనసాగుతుండటంతో రాళ్లవాగు ఇప్పుడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ రాళ్ల వాగు.. మహానంది మండలంలోని గాజులపల్లె గ్రామ సమీపంలో.. నల్లమల అడవిలో ఉన్న పురాతన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం కింది భాగంలో ప్రవహిస్తూ ఉంటుంది. అయితే ఈస్వామి వారి కళ్యాణం సందర్భంగా వజ్రాలతో తలంబ్రాలు పోశారని స్థానికులు నమ్ముతారు. ఈ వజ్రాలు కాస్త.. ఆలయం క్రింద భాగంలో ప్రవహించే రాళ్లవాగులో కలిశాని.. అందుకే ఇక్కడ వజ్రాలు దొరికేందుకు అవకాశం ఉంది అంటున్నారు. అలానే ఈ రాళ్ల వాగును వజ్రాల వాగుగా పిలుస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ వాగులో వజ్రాలు లభ్యమవుతున్నాయనే ప్రచారం ఉండేది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వజ్రాల మీద ఆశతో.. వాగు వెతుకుతున్నారు. అయితే ఎవరికి ఏ వజ్రం దొరకలేదని చెబుతున్నారు. కేవలం సుద్దరాళ్లు మాత్రమే లభిస్తున్నాయని తెలుస్తోంది. ఈ ప్రాంతం.. గాజులపల్లె రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే ఉండటం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉండటంతో మహిళలు కూడా ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. ఎవరికైనా వజ్రం దొరికిందని అనుమానం కలిగితే.. దానిని పరీక్షించేందుకు అక్కడే కొందరు వ్యక్తులు పరికరాలతో పరీక్షిస్తున్నారు. అయితే గతంలో ఒక్క రాయి పరీక్షించేందుకు 10 రూపాయలు తీసుకుంటే, ఇప్పుడు రూ.30 తీసుకుంటున్నారు. ఇక్కడ వజ్రాలు అయితే దొరకడం లేదు కానీ.. హోటళ్లు, కూల్ డ్రింక్ షాపులు, ఐస్ క్రీములు అమ్మే బండ్లకు మాత్రం మంచి వ్యాపారం జరుగుతోంది.

# జనంలోనే జగన్ ఉండాలి

## కోరుకుంటున్న వైసీపీ నాయకులు



**విజయవాడ, సూర్య వాస్తవం, నవంబర్ 10:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటనలకు మంచి స్పందన లభిస్తుండటంతో ఇక ప్రజల్లో ఉండాలని జగన్‌ను నేతలు కోరుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికలు జరిగి రెండేళ్లు కావస్తుండటంతో వైసీపీకి హనీమూన్ పీరియడ్ ముగిసిందంటున్నారు. ఇప్పుడు కూడా అడపా దడపా వచ్చి ప్రజలను కలుసుకోవడం బాగా లేదని కొందరు వైసీపీ సీనియర్ నేతలే అభిప్రాయపడుతున్నారు. బెంగళూరు నుంచి మకాం మార్చేసి జగన్ తాడేపల్లిలోనే ఉంటూ నిత్యం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచిస్తున్నారు. అప్పుడే క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ప్రస్తుతం పాజిటివ్ వేవ్ ఉన్న కారణంగా జగన్ దానిని చెడగొట్టుకునే ప్రయత్నం చేయవద్దని కూడా సూచిస్తున్నారు. మరొకవైపు త్వరలోనే ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు దూరంగా వైసీపీ ఉంటుందన్న ప్రచారాన్ని పార్టీ నేతలు ఖండిస్తున్నారు. గెలిచినా, ఓటమి పాలయినా స్థానిక సంస్థల ఎన్నికల బరిలో ఉంటామని చెబుతున్నారు. పోటీ లేకుండా చేసి ఎన్నికలను ఏకగ్రీవం చేయడం వల్ల టీడీపీకి అదనపు బలం తమకు తామే సమకూర్చినట్లవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. జగన్ కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపి తాడోపేడో తేల్చుకోవాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. లేకుంటే ద్వితీయ శ్రేణి నేతలు నీరుగారిపోతారని, క్యాడర్ కూడా పార్టీకి దూరమవుతుందన్న భావనలో జగన్ ఉన్నారు. అందుకోసమే ఇక జనంలోనే ఉండాలని జగన్ కూడా భావిస్తున్నారు.. సమస్యల వారీగా జిల్లాల పర్యటన చేయాలని ఆయన భావిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఏదో ఒక సమస్య మీద ప్రతి జిల్లాలో నెలకు రెండు రోజుల పాటు టూర్ చేయాలన్న ప్లాన్ లో జగన్ ఉన్నారని తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలు జనవరి నెలలో జరిగే అవకాశముండటంతో అందుకు రెండు, మూడు నెలల కూడా సమయం లేకపోవడంతో ఇక జిల్లాల పర్యటనకు జగన్ రెడీ అవుతున్నారని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. ఈ పర్యటనలతో పార్టీలో హైప్ రావడమే కాకుండా జనంలో కూడా జగన్ ఉన్నారన్న సంకేతాలు వెళతాయని, అధికార పార్టీ అక్రమ అరెస్ట్ లు కూడా ఎండగట్టే అవకాశముంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. టూర్ షెడ్యూల్ ను సిద్ధం చేయాలని పార్టీ నేతలను జగన్ కోరినట్లు తెలిసింది. ఇక 2027లో రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయడానికి కూడా సిద్ధమయ్యారు. ఇందుకోసం ఆయన ముందుగా జిల్లాలు తిరిగి క్యాడర్ ను, లీడర్లను మోటివేట్ చేయనున్నారని తెలిసింది.

# సాంకేతిక విజ్ఞానంతో పరిశోధనల్లో ప్రగతి

## ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తి



**తిరుపతి, సూర్య వాస్తవం, నవంబర్ 10:** విశ్వవ్యాప్తంగా నిత్యం కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని సరైన విధానంలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా పరిశోధన రంగంలో ప్రగతిని సాధించవచ్చని ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కొత్త మధుమూర్తి పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగం, తిరుపతి మరియు ముంబయ్‌లోని వెస్టర్న్ రీజనల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్ ఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆధ్వర్యంలో నడిచే జాతీయ పరికరాల సౌకర్య కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న "ఫ్యాకల్టీ కోసం ల్యాబొరేటరీ పరికరాల ఆపరేషన్ మరియు మెయింటెనెన్స్" పై ఒక వారం పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం 2025 డిసెంబర్ 15 నుంచి 19 వరకు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగంలో జరుగనుంది. ఈ సందర్భంగా ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ఆచార్య విజయభాస్కరరావు గారితో తో కలిసి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి గారు ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం మంగళగిరిలోని మండలి కార్యాలయంలో విడుదల చేసి మాట్లాడారు. ఈ తరహా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఉన్నత విద్యా రంగంలో సాంకేతిక ప్రావీణ్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

### విశ్వవిద్యాలయాల్లో కోట్ల రూపాయల విలువ చేసి పరిశోధన పరికరాలు

ఏపీ వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో కోట్ల రూపాయల విలువ చేసే పరిశోధన పరికరాలు అందుబాటులో ఉన్నాయని, అదేవిధంగా ఇతర విద్యా సంస్థల్లో ఉన్న ఖరీదైన పరికరాలు చిన్నపాటి లోపాల కారణంగా వాడుకలో లేకుండా పోతున్న నేపథ్యంలో, ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులు మరియు సాంకేతిక సిబ్బందికి పరికరాల ఆపరేషన్, కాలిబ్రేషన్, నిర్వహణ, మరియు మరమ్మతులపై సమగ్ర శిక్షణ లభిస్తుందని ఆచార్య మధు మూర్తి గారు తెలిపారు. వైస్ ఛైర్మన్ ఆచార్య విజయభాస్కరరావు మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా ల్యాబొరేటరీ పరికరాల వినియోగ సామర్థ్యం, ఆయుష్షు, నిలకడతనం పెరుగుతాయని, దీని ఫలితంగా శాస్త్రీయ విద్యా మరియు పరిశోధన నాణ్యత గణనీయంగా మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య దేవప్రసాద్ రాజు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డా. పి. చంద్రశేఖర్, డా. పి. చెంగయ్య, డా. ఎం. హరి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టచ్ స్క్రీన్ ద్వారా దర్శనం టిక్కెట్లు

**కర్నూలు, సూర్య వాస్తవం, నవంబర్ 10:** ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ దేవాలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆలయాల్లో వంద కియోస్క్ లు ఏర్పాటు చేయనున్నారు. టచ్ స్క్రీన్ ఉండే వీటి ద్వారా భక్తులు దర్శనం, వివిధ సేవల టికెట్లు నేరుగా పొందొచ్చు. వీటిలో ఎన్ని టికెట్లు కావాలో నమోదు చేసి.. డిజిటల్ చెల్లింపు చేస్తే వెంటనే టికెట్లు జారీ చేస్తుంది. కరూర్ వైశ్యా బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఈ కియోస్క్ మెషిన్లను ఉచితంగా అందిస్తోంది. ఈ కొత్త కియోస్క్‌లు భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటాయి. ఇకపై క్యూలైన్లో నిలబడాల్సిన అవసరం లేకుండా, తమకు కావాల్సిన దర్శనం, సేవల టికెట్లను నేరుగా ఈ స్క్రీన్ కియోస్క్ మెషిన్‌ల ద్వారా కొనుగోలు చేయొచ్చు. ఉద్యోగులు అవసరం లేకుండానే నేరుగా టికెట్లు పొందేలా వీలు కల్పిస్తున్నారు. ఈ విధానం ద్వారా ఆలయాల నిర్వహణపై భారం తగ్గుతుంది. అయితే, వాటి ఇన్‌స్టలేషన్, నిర్వహణ బాధ్యతలను కరూర్ వైశ్యా బ్యాంకు చూసుకోనుంది. ఏపీలోని ప్రధాన ఆలయాలైన విజయవాడ కనకదుర్గమ్మ, సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవాలయాల్లో ఎనిమిది చొప్పున వీటిని ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా ముఖ్య ఆలయాలైన అరసవిల్లి, విశాఖ కనకమహాలక్ష్మి, తలుపులమ్మ, వాడపల్లి, పెనుగంచిప్రోలు, మోపిదేవి, పెదకాకాని, పెంచలకోన, తలకోన, ఈరన్నస్వామి, మహానంది, బేతంచెర్ల మద్దిలేటి నరసింహస్వామి, కసాపురం ఆంజనేయస్వామి, కదిరి లక్ష్మీనరసింహస్వామి, బోయకొండ గంగమ్మ ఆలయాల్లో మూడేసి కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేయనున్నారు. తిరుమలలో ఇప్పటికే కియోస్క్ మెషిన్లను ఉపయోగిస్తున్నారు. అన్నప్రసాద వితరణ కేంద్రంలో భక్తులు విరాళాలు అందజేసేందుకు ఈ కియోస్క్ మెషిన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. లడ్డూ విక్రయాల కోసం కూడా కియోస్క్ మెషిన్లను ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా.. రాష్ట్రంలోని ప్రధాన, ముఖ్యమైన ఆలయాల్లో వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు



**పామిడి, సూర్య వాస్తవం, నవంబర్ 10:** మండల పరిధిలోని కృష్ణవేణి స్కూలు విద్యార్థులు టి. సత్య బ్రూస్లీ, తిరుపతి. అభిరామ్,హెచ్.నవనీత్, నేనావత్ కీర్తి వన్నె శ్రీ,ఎన్. జతిన్ రెడ్డి, ఎస్కే.షాకీర్, టి. సత్య గౌరవ్ లీ, వై. గోకుల్ కృష్ణ, బనావత్ ఉమామహేశ్వరి, బి.భవిష్య రెడ్డి, పి.అస్పియా ఐమాన్, వై. చరణ్ తేజ్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 14 నుంచి 16 వరకు కాకినాడలో జరగనున్న 39వ సబ్- జూనియర్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో ఈ చిన్నారులు పాల్గొంటారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన చిన్నారులను పాఠశాల కరస్పాండెంట్ ఆర్.అనురాధ రెడ్డి, ఇన్చార్జ్ కే.శశికళ, పిఈటి.వెంకటరమణ మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.


## కిడ్నీ రోగికి జమియత్ కమిటీ ఆర్థిక సాయం



**గోరంట్ల, సూర్య వాస్తవం, నవంబర్ 10:** గోరంట్ల పట్టణం లోని కూరగాయల మార్కెట్ వీధిలో నివాసముంటున్న ఆరిఫ్ కూతురు జైబా (12సం,లు) బాలాజి హాస్పిటల్, హిందూపురం లో కుడి కిడ్నీ కి సర్జరీ జరిగింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేదని జమియత్ ఉలమా సభ్యులకు తెలియజేయగా, పేషెంట్ జైబా కి మందులు ఖర్చుల కొరకు 15,000/- రూ.ల. నగదు ఆర్థిక సహాయం అంద జేశారు, ఈ జమియత్ ఉలమా ఏ హింద్ సంస్థ యొక్క శాఖ ద్వారా గోరంట్ల మండలంలో దాదాపు 13 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మన గోరంట్ల లో జమియత్ ఉలమా చేస్తున్న సహాయ సహకారాలు గోరంట్ల మండలానికి గర్వకారణం అని ప్రజలు కొనియాడారు, ఈ కార్యక్రమంలో జమియత్ ఉలమా గోరంట్ల మండలం అధ్యక్షులు మౌలానా షఫీవుల్లా, ఉపాధ్యక్షులు మౌలానా అబ్దుల్లా, హాఫిజ్ జావీద్, మౌలానా ముజీబ్, జాయింట్ సెక్రటరీ ముఖ్తీయార్ పాల్గొన్నారు.

## అనారోగ్యంతో తల్లి మృతి

- అనాథలుగా మారిన పిల్లలు
- మంత్రి సవితమ్మ ఆదేశాలతో ఆర్థిక సహాయం



**గోరంట్ల, సూర్య వాస్తవం, నవంబర్ 10:** గత రండు ఏళ్ల క్రితం తండ్రి మృతి తో కుటుంబ భారం మోస్తున్న తల్లి అనారోగ్యంతో మృతిచెందగా నా అన్న వాళ్ళు లేకుండా ముగురు పిల్లలు అనాథలుగా మారిన సంఘటన గోరంట్ల మండలంలో చోటు చేసుకుంది, గోరంట్ల మండలంలోని పాలసముద్రం గ్రామంలోని ఎస్. సి.కాలనికి.చెందిన కె. రామంజినేయులు రెండు సంవత్సరాల కిందట అనారోగ్య కారణంగా మరణించాడు, భార్య రామంజినమ్మ ముగ్గురు పిల్లలను కూలీ పనులకి వెళ్లి కుటుంభం పోషణ సాగిస్తుంది,కానీ నిన్న ఆకస్మికంగా నిన్న రామంజీనమ్మ మరణించింది. ఆ కుటుంబం ఒక పెళ్లి కానీ కూతురు, కొడుకు అనాథలుగా మారారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ ఆదేశాలతో పాలసముద్రం తెలుగు.దేశం పార్టీ నాయకులు ఆర్థిక సాయం అందించారు, ఈ కార్యక్రమం లో పాలసముద్రం సహకార బ్యాంకు అధ్యక్షులు చంద్ర,మనోహర్, ఇర్షాద్, కె.జయచంద్ర రెడ్డి, సన్ని,సుధాకర్,మల్లి,జయరామ్, మండ్లి నాగప్ప, ఇల్లూరినరసింహ,లింగప్ప,బి.నరసింహ మూర్తి, యు.గంగాధర్ పాల్గొన్నారు, ఆ కుటుంబానికి ప్రభుత్వం తరుపున అన్ని రకాల సహాయ సహకారాలు అందించి అండగా ఉంటాం అని మంత్రి ద్వారా తెలియజేశారు.

# ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించండి

## జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు

**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 10:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను సంతృప్తిస్థాయిలో త్వరగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. నాణ్యతతో కూడిన పరిష్కార మార్గం చూపేలా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి సమస్యలను పరిష్కరించాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్నవి, సంక్లిష్టమైన అర్జీలను అలాగే వదిలిపెట్టకుండా నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంతృప్తి స్థాయిలో వేగవంతంగా, నాణ్యతతో,బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను పరిష్కరించాలని తెలిపారు. అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించిన జిల్లా రెవెన్యూ అధికారి ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు స్నాక్స్, వాటర్ బాటిల్స్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీ దారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు.




**ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు**

. గుర్రంకొండ మండలం రామిరెడ్డి గారి పల్లి కు చెందిన నాగభూషణమ్మ తనకు తేదీ.19. 07.2024 న ఆర్టీసీ బస్సు ప్రమాదం వలన కాలు వీరిగిందని అప్పటినుండి చక్రాల కుర్చీకే పరిమితమైనని అప్పటినుండి పలుమార్లు అధికారులకు పెన్షన్ కొరకు దరఖాస్తు ఇవ్వడం జరిగిందని తమరు ఈ విషయాన్ని పరిశీలించి వికలాంగుల పెన్షన్ ఇప్పించవలసిందిగా జిల్లా రెవెన్యూ అధికారి కు విన్నవించుకున్నారు. టి సుండుపల్లెకు చెందిన బొమ్మిరెడ్డి భాగ్యమ్మ తన భర్త బి. కృష్ణ తేదీ.25.08.2023 న మరణించడం జరిగిందని తను నిరుపేదనని కుటుంబ పోషణ కష్టంగా ఉందని తనకు వితంతు పింఛను ఇప్పిం చవలసిందిగా జిల్లా రెవెన్యూ అధికారికి విన్నవించుకు న్నారు. మదనపల్లి మండలం కొత్తవారిపల్లి గ్రామ పంచా యతీ పరిధిలోని ఎనుములవారిపల్లి చెందిన ఏసుపాదం ఎనుములవారిపల్లి కాలనీ లో మా తల్లిగారు సుబ్బమ్మ పేరున సర్వేనెంబర్ 491/1A లో 0.03 సెంటు ఇంటి జాగా ప్రభుత్వం వారు ఇచ్చారని, అయితే స్థానికంగా ఉన్న వారు ఇంటి స్థలంను రోడ్డుకు ప్రజా సౌకర్యం కొరకు రోడ్డుకు వదలడం జరిగింది ఆ తరువాత, ఈ స్థలాన్ని పి.సురేందర్ రెడ్డి అనే అతను ఇతరులకు అమ్మ వేయడం జరిగిందని ఈ విషయమే తమరు విచారణ జరిపి మా స్థలాన్ని మాకు తెప్పించాల్సిందిగా జిల్లా రెవెన్యూ అధికారి కు విన్నవించుకున్నారు. బి. కొత్తకోట కు చెందిన కె. చైత్ర తను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, తన కుమారుడు కె.పునీత్ బి.కొత్తకోటలోని ప్రభుత్వ పాఠ శాలలో రెండవ తరగతి చదువుతున్నారని తల్లికి వందనం డబ్బులు ఇంతవరకు జమ కాలేదని కావున తమరు సంబంధిత అధికారులతో విచారణ జరిపి తల్లికి వందనం డబ్బులు ఇప్పించవలసిందిగా జిల్లా రెవెన్యూ అధికారికి విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా రెవెన్యూ అధికారి వారికి వివిధ రకాలఅర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడి సర్వేయర్ భరత్ కుమార్,జి ఎస్ డబ్ల్యూ ఎస్ లక్ష్మీపతి, డ్వామా పిడి వెంకటరత్నం, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లా అభివృద్ధికి

# నిధులు మంజూరుపై సీఎం ప్రకటన చేయాలి

### రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి విజ్ఞప్తి



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 10:** రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు గారి 12 తేదీ పర్యటనలో అన్నమయ్య జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ ప్రకటించాలని,2024 సంవత్సరం ఎన్నికల సభలో రాయచోటి ప్రజలకు ఇచ్చిన మాటను తప్పొద్దని, హామీ నిలబెట్టుకోవాలని, రాయచోటిని జిల్లా కేంద్రంగానే యధావిధిగా కొనసాగిస్తూ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథ రెడ్డి సోమవారం ఒక పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. నేటి ప్రభుత్వం ఒక అసెంబ్లీ నియోజకవర్గ మంతా ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలన్నట్లే ,ఒక పార్లమెంటు నియోజకవర్గమంతా ఒకే జిల్లాగా ఉంటే తప్పేమిటి? అని ఆయన ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా, రాష్ట్రమంతటా అసెంబ్లీ,పార్లమెంటు నియోజకవర్గల పునర్వ్యవస్థీకరణ పూర్తిచేసే వరకు, తాజా జనగణనపూర్తియై వరకు అన్నమయ్య జిల్లా విభజనను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కరువు పీడిత రాయలసీమ అభివృద్ధిపై చిత్తశుద్ధితో కడప-రాయచోటి-మదనపల్లె- బెంగుళూరు రైల్వే లైన్ నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాయచోటి వరప్రసాదిని హంద్రీ -నీవా ప్రాజెక్టు ద్వారా అడివిపల్లె, శ్రీనివాస్ పురం రిజర్వాయర్లకు నీధులు కేటాయించి త్రాగు,సాగు నీరు అందించాలని ఆయన కోరారు.మదనపల్లె అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రైవేటు (పిపిపి)పరం చేయకుండా ప్రభుత్వ రంగంలోనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాయచోటి, మదనపల్లె, రాజంపేటలపై నిజంగా ప్రేమ ఉంటే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ప్రభుత్వ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా విభజన రాజకీయ దృక్కోణంలో కాకుండా ప్రజల సౌకర్యం,సంక్షేమం,అభివృద్ధి దృక్కోణంలో ఒకే జిల్లాగా కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి కోసం 3 లక్షల కోట్ల కేటాయించినట్లే నూతన జిల్లాల భవన సముదాయల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలో అత్యంత కరువు కాటకాలతో అల్లాడుతున్న రాయచోటి ప్రాంత వెనుకబాటు తనమే ప్రాతిపదికగా రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ప్రభుత్వాలకు భాధ్యత ఉందని ఆయన గుర్తు చేశారు.2024 ఎన్నికల సందర్భంగా రాయచోటి బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఇచ్చిన హామీని నిలబెట్టు కోకపోతే తన పార్టీకి ఓట్లు వేసి గెలిపించిన ఓటర్లకు నమ్మక ద్రోహం చేసిన వారవతారని,ఆ పాపానికి చంద్రబాబు నాయుడు గారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒడికట్టరని రాయచోటి ప్రాంత ప్రజలు విశ్వాసంతో ఉన్నారని ఆయన తెలిపారు.గత ప్రభుత్వంలో నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా కేంద్రముగా అన్ని కోణాల్లో పరిశీలించే రాయచోటిని ఎంపిక చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాయచోటిలో జిల్లా స్థాయి కార్యాలయ భవనాలకు స్థలాలను కూడా ప్రభుత్వం సేకరించడం,నిధులు కూడా మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. స్థితిలో ఉన్న రాయచోటిని జిల్లా కేంద్రంగా యథావిధిగా కొనసాగించి కలెక్టర్ ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణాలకు, ఎస్ పి కార్యాలయ భవన నిర్మాణాలకు నిధులు కేటాయించి వినియోగించాలని ఆయన కోరారు.సుండుపల్లె, వీరబల్లె మండలాలను సుదూరంగా, అసౌకర్యంగా ఉన్న రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో నుంచి తోలగించి అతి దగ్గరలో, సౌకర్యంగా ఉన్న రాయచోటి రెవెన్యూ డివిజన్ పరిధిలోకి కలపాలని ఆయన డిమాండ్ చేశారు. రాయచోటిని జిల్లా కేంద్రంగా కాపాడే బాధ్యతను మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి మరియు మంత్రి రామప్రసాద్ రెడ్డి గార్లు బాధ్యత తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే మనం సంపాదించుకొన్న సౌకర్యాలను కాపాడుకోకుండా పోగొట్టుకుంటే భవిష్యత్తు తరాలు మనల్ని క్షమించవని ఆయన హెచ్చరించారు.

# చిత్రావతి నదిలో ఇసుక అక్రమ రవాణాపై రైతుల ఆగ్రహం

## ఇసుక రవాణాను ఆపాలని తహసీల్దార్‌కు రైతుల వినతి

**గోరంట్ల, సూర్య వాస్తవం, నవంబర్ 10:** చిత్రావతి నది పరివాహక ప్రాంతంలోని బూదిలి వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తూ ఉండడంతో రోజురోజుకు ఇసుక కనుమరుగవుతూ భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో పాటు బోర్లు బావులు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఈ సందర్భంగా సోమవారం గోరంట్ల తహసిల్దార్ కార్యాలయం చేరుకొని గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా ఇసుక అక్రమ రవాణాచేస్తూ సొమ్ము చేసుకుంటున్న కొందరు వ్యాపారస్తుల వల్ల చిత్రావతి నదిలో రోజురోజుకు ఇసుక అడుగంటి సమీప ప్రాంతాల్లోని రైతుల బోర్లు, చిత్రావతి నదిలోని ఫిల్టర్ బోర్డులు, గ్రామాల్లోని చేతిపంపుల్లో రోజు రోజుకు భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని తాసిల్దార్ మారుతి కి బూదిలీ, పాపిరెడ్డి పల్లి గ్రామాల రైతులు వినతి పత్రాన్ని అందజేశారు. చిత్రావతి నది నుంచి 6 మంది ట్రాక్టర్ యజమానులు ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఫిర్యాదులు పేర్కొన్నారు, ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణా దారులపై కఠిన చర్యలు తీసుకొని వ్యవసాయ రైతులను ఆదుకోవాలని తాసిల్దార్ ను వేడుకున్నారు. ఈ తహసిల్దార్ ను సందర్భంగా పాపిరెడ్డి పల్లి, బూదిలి గ్రామానికి చెందిన రైతులు ఈడిగ రవి, మల్లికార్జున, యల్లయ్య, మూర్తి, శివప్ప తదితరులు పాల్గొన్నారు.



## హత్యలు, దోపిడీ వంటి 18కేసుల్లో మోస్ట్ వాంటెడ్ హంతకుల ముఠా అరెస్ట్



**మదనపల్లె, సూర్య వాస్తవం, నవంబర్ 10:** ఆంధ్రప్రదేశ్‌లో హత్యలు, దోపిడీలు, ఎర్రచందనం, గంజాయి, స్మగ్లింగ్ వంటి 18 కేసుల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ గా ఉన్న హంతకుడు సుల్తాన్ తో పాటూ అతడి ముఠాను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుల అరెస్టుకు సంబంధించి జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, డిఎస్పీ మహీంద్ర ఆదేశాలతో ఒకటో పట్టణ సీఐ మహమ్మద్ రఫి తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, దేవళం వీధికి చెందిన సుల్తాన్, రబ్బాని, సాదిక్, ఆసిఫ్, మౌలా లు ఆగస్టు15న అంగళ్ళులో కూలీపని చేసుకుంటూ జీవనం సాగించే వెస్ట్ బెంగాల్ కు చెందిన యువకుడు షేక్ ఖదీర్ ను హత్య చేసి 16 వ తేదీన మదనపల్లె మండలం, సీటీఎం రైల్వే ట్రాక్ పై పడేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్పీ ఆదేశాల మేరకు మూడు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు సాగించారు. గంజాయి సరఫరా నేపథ్యంలో వెస్ట్ బెంగాల్ యువకుడు ఖదీర్ ను సుల్తాన్ అతని ముఠా సభ్యులు రబ్బాని, సాదిక్, ఆసిఫ్, మౌలా లు అత్యంత దారుణంగా కొట్టి చంపారని దర్యాప్తు లో తేలడంతో వారిని అరెస్ట్ చేశారు. వీరితో పాటూ హత్య సమయంలో ఉపయోగించిన ఇతియోస్ కారును సీజ్ చేశారు.

**సుల్తాన్ పై పీడీ యాక్ట్ సిఫారసు**

సుధీర్ఘ నేర చరిత్ర కలిగి, హత్యలు, దోపిడీలు, స్మగ్లింగ్, ఎర్రచందనం, గంజాయి వంటి 18 కేసుల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ గా ఉన్న సుల్తాన్ పై పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు ఎస్పీ కి సిఫారసు చేస్తున్నట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు.



## కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

**నాయుడుపేట, సూర్య వాస్తవం, నవంబర్ 10:** ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నాయుడుపేట మండలంలోని పూడేరు గ్రామంలో నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.తమ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణకు చేస్తున్న కుట్రలను కోటి సంతకాలు పూర్తి చేయడం ద్వారా అడ్డుకుంటామని ఈ సందర్భంగా ఆయన అన్నారు.అనంతరం స్థానిక వైసీపీ నాయకులతో కలిసి పూడేరు గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి,నాయుడుపేట మండల వైసీపీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్‌యాదవ్, నియోజకవర్గ వైసీపీ మహిళ అధ్యక్షురాలు ఈదా రత్నశ్రీ,అరవ పిరమిడి సర్పంచ్ శంకరయ్య,వైసీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, బాలసుబ్రమణ్యం,భూపయ్య, తదితరులు పాల్గొన్నారు.




## మదనపల్లెలో అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.40 లక్షల బంగారం స్వాధీనం



**మదనపల్లె, సూర్య వాస్తవం, నవంబర్ 10:** అంతర్రాష్ట్ర దొంగను సోమవారం ఒకటో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ మహమ్మద్ రఫీ అరెస్ట్ వివరాలు వెల్లడించారు. సత్యసాయి జిల్లా, తనకల్లు మండలం, నందిగానిపల్లికి చెందిన పసుపులేటి సాయికుమార్ అలియాస్ సాయినితీష్ పలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతూ చోరీలు చేసేవాడు. దీంతో ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్ట్ చేశారు. నిందితుని వద్ద నుంచి రూ. 40 లక్షల విలువైన 336 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక రాయల్ ఎన్ ఫీల్డ్ మోటార్ బైక్, ఐఫోన్ మొబైల్ స్వాధీనం చేసుకున్నారు.



# చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 134 ఫిర్యాదులు : ఎస్పీ అజిత వేజెండ్ల






**నెల్లూరు, సూర్య వాస్తవం, నవంబర్ 10:** జిల్లా పోలీసు కార్యాలయం నందు నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో 134 ఫిర్యాదులు స్వీకరణ.వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫిర్యాదుదారులను మాట్లాడించి, వారికి తక్షణమే ఉపశమనం కలిగించే విధంగా తగిన చర్యలు తీసుకున్న జిల్లా యస్.పి. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదు.ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ఆదేశాలు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా యస్.పి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో యస్.పి. మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 134 ఫిర్యాదులు. వచ్చాయి.

**ఫిర్యాదుల్లో కొన్ని...**

వేదాయపాలెం పరిధికి చెందిన వ్యక్తిని నెల్లూరుకు చెందిన గోళ్ళ బెనర్జీఏహర్షవర్ధన్ అనే వ్యక్తి పది లక్షల రూపాయలు నగదు తీసుకొని బ్యాంకు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, ఉద్యోగం ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా వేదిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. కావలి పరిధికి చెందినటువంటి మహిళను కలిగిరిలోని ఓ హాస్పిటల్ లో పనిచేసి మానేసినట్లు, కలిగిరికి చెందిన వేణు అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని చెప్పగా, ఒప్పుకోలేదని, మనసులో పెట్టుకొని, అసభ్యకరంగా నా ఫోటోలు ఇంస్టాగ్రామ్ లో పెడుతూ వేధిస్తున్నాడని, వేణు, అతనికి సహకరించిన వారిపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నెల్లూరు రూరల్ పరిధికి చెందిన దివ్యాంగురాలని మనుబోలుకు చెందిన తాళ్లూరు రమణయ్య అనే వ్యక్తి తన బలహీనతను ఆసరాగా చేసుకుని నమ్మించి, తన ఇంటికి తీసుకెళ్లి, పలు విధాలుగా వేధించినట్లు తన నుండి రక్షణ కల్పించాలని కోరారు. కొండాపురం పరిధికి చెందిన మహిళను, మరి కొంతమందిని, కొండాపురంకు చెందిన తప్పెట మాలకొండయ్య అనే వ్యక్తి పలు రకాల సబ్సిడీ లోన్లు ఇప్పిస్తానని నమ్మించి ఒక్కొక్కరు వద్ద 35000 నగదు తీసుకొని లోను ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు. బుచ్చి పరిధికి చెందిన మహిళను తన భర్త అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తూ ఇంటింటి గెంటివేశారని విచారించిన న్యాయం చేయాలని అదే విధంగా నెల్లూరు రూరల్ పరిధికి చెందిన మహిళ పొదలకూరులో పెళ్లి చేసుకున్నట్లు, వివాహమైనప్పటినుండి భర్త, అత్తింటివారు వేధిస్తున్నట్లు, తన బంగారం కూడా తీసుకొని బ్యాంకులో కుదరపెట్టినట్లు, ఇంటి నుండి వెళ్లిపోవాలని వేధిస్తున్నారని కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు. దర్గామిట్ట పరిధికి చెందినటువంటి 70 సంవత్సరాల వృద్ధురాలు మున్సిపల్ శాఖలో పని చేసి రిటైర్డ్ అయినట్లు, రిటైర్డ్ అనంతరం వచ్చినటువంటి మొత్తం నగదు తన పెద్ద కొడుకు శ్రీనివాసులు తీసుకుని, ఇప్పుడు పెన్షన్ డబ్బులకు కూడా ఇవ్వాలని వేధిస్తున్నట్లు అదేవిధంగా జలదంకి పరిధికి చెందినటువంటి వృద్ధ దంపతులను నాలుగో కుమారుడు వెంకటేశ్వర్లు తన పక్కింట్లో ఉంటూ తన జీవనాధారం కోసం ఇచ్చిన పొలాన్ని అమ్మి డబ్బులు ఇవ్వాలని, తన ఉన్న ఇంట్లో నుండి వెళ్లిపోవాలని వేధిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. దర్గా మిట్ట పరిధికి చెందిన వ్యక్తి యొక్క భార్య ఇంటి నుండి వెళ్లిపోయినట్లు, సదర విషయమై దర్గా మిట్ట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు, తన భార్య ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా జిల్లా యస్.పి. డా. అజిత వేజెండ్ల, హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సి.హెచ్ సౌజన్య , ఆత్మకూరు డిఎస్పీ వేణుగోపాల్ , ఎస్ బి డిఎస్పీ శ్రీనివాసరావు , లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి , పి సి ఆర్ సి ఐ భక్తవత్సల రెడ్డి, ఎస్.బి-2 సి ఐ శ్రీనివాసరెడ్డి కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# భోగేశ్వర స్వామికి సహస్ర దీపాలంకర సేవ



**పామిడి, సూర్య వాస్తవం, నవంబర్ 10:** పామిడి భోగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం మూడో సోమవారం సహస్ర దీపాలంకరసేవ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న భోగేశ్వరుడు అలాగే, పామిడి పట్టణం లోని వాసవి కల్యాణ మండపంలో ఈవేళ వార్షిక గురప్పస్వామి పొంగుపాలు కార్యక్రమం ఈవేళ నిర్వహించారు. కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా కార్యక్రమం చేపట్టమని అసంఘం అధ్యక్షులు మురారి రత్న ప్రభాకర్ తెలిపారు. భక్తుల శివ నామ సంకీర్తనతో, గురప్పస్వామి నామొచ్చారాణతో మంటపం భక్తులు పరవష్యులు లయ్యారు. ఈ కార్యక్రమంలో గుత్తి కరెంట్ డిఈ పరశురామ పిల్లయ్, స్థానిక సంఘం వారు భక్తాదుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నిరుపేదలకి ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

### తహసీల్దార్‌కి ఏఐకెఎంఎస్ వినతి



**గుత్తి, సూర్య వాస్తవం, నవంబర్ 10:** గుత్తి మండలంలో జీవిస్తున్న బీదవారికి వెంటనే స్థలాలు మరియు పక్కా గృహాలను నిర్మించాలనీ గుత్తి మండల తహసీల్దార్ గారికి వినతి ప త్రం ఇవ్వడం జరిగింది.ఈ కా ర్యక్రమంలో ఏఐకెఎంఎస్ జి ల్లా కమిటీ సభ్యులు రామాం జనేయులు,జిల్లా సహాయ కార్యదర్శి పి కృష్ణ మాట్లా డుతూ కొన్ని సంవత్సరాలు గా గుత్తి పట్టణంలోమరియు చుట్టుపక్కల ప్రాంతాలలో అ నేక మంది ఎస్సీ ఎస్టీ బీసీమై నారిటీ వర్గాలు కూలి పను లు చేసుకుంటూ జీవనం సా గిస్తున్నారు తమకు సొంత ఇ ల్లు లేక బాడిగింట్లో ఉంటూ నెలకు వేల రూపాయల చొ ప్పున బాడీ చెల్లిస్తూ బ్రతు కుతున్న పరిస్థితి సొంత ఇం డ్లు లేక తెచ్చుకున్న కూలి బా డిగలు చెల్లించలేక అవస్థలు పడుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నటువంటి పరిస్థితి బీదవారికి ఇండ్లు మంజూరు చేయమని అనేక సంవత్స రాలుగా ఆధ్వర్యంలో కలెక్టర్ల కి ఎమ్మార్వోలకి రాజకీయ నాయకులకు వినతి పత్రాలు ఇచ్చిన వాళ్లని పట్టించుకోని పాపాన పోలేదు కూటమి ప్ర భుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిపోయిన ఇంతవరకు స్థలాలు పక్క ఇండ్లు మం జూరు చేయకపోవడం బాధ కలిగించే అంశం కూటమి ప్ర భుత్వం తమ ఎన్నికల ప్రచారాలలో భాగంగా ఇండ్లు లేని నిరుపేదలకి ఇండ్లు కట్టిస్తా మని మరియు వెంటనే స్థలా లు మంజూరు చేస్తామని చె ప్పడం జరిగింది ఇంతవరకు కూటమి ప్రభుత్వం ఆదిశగా నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల చాలీచాలని కూలి బతు కులతో అనేకమంది ఇబ్బందులు పడుతున్నటువంటి పరిస్థితి ఈ పరిస్థితిని వెంట నే అర్థం చేసుకొని స్థలం లేని వారికి వెంటనే స్థలాలు మం జూరు చేసి పక్కా ఇండ్లు క ట్టించమని ఏఐకేఎం ఎస్ గా డిమాండ్ చేస్తా ఉన్నాం లేక పోతే గుత్తి మండలంలో ఎ స్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గా లను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చు డతామని తెలియజేస్తూ ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు పక్రుద్దీన్,వెంకటేష్,రాజశేఖర్,ధనుంజయ్, శివ,రామాంజనేయులు,దస్తగిరమ్మ,నజీర్,రాధమ్మ పా ల్గొనడం జరిగింది.

# డిసెంబర్ 25న 'దండోరా' విడుదల



లౌక్య ఎంటర్‌టైన్మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందిస్తోన్న తాజా చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉంది. తాజాగా ఈ సినిమాను క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న విడుదల చేస్తున్నామని నిర్మాతలు ప్రకటించారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన పోస్టర్ రిలీజైంది. పోస్టర్‌ను గమనిస్తే ఇన్నోవేటివ్‌గా ఉంది. ఓ ఖాళీ ప్రాంతంలో తవ్విన గొయ్యి కనిపిస్తోంది. అందులో ఈ ఏడాదికి డ్రామటిక్‌గా ముగింపునిస్తున్నాం అనే క్యాప్షన్‌తో రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. జాతీయ అవార్డు గెలుచుకున్న చిత్రం 'కలర్ ఫొటో', బ్లాక్‌బస్టర్ మూవీ 'బెదురు లంక 2012' చిత్రాలను నిర్మించిన దర్శకుడు కావటంతో అంచనాలు పెరిగాయి. సామాజిక స్పృహను కల్గించే అంశంతో ఈ సినిమా తెరకెక్కు తోంది. పెత్తందారుల కుటుంబానికి చెందిన అమ్మాయిలను ప్రేమించి పెళ్లి చేసుకున్నా, వారికి ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతున్నాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో అక్కడున్న పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమాను ఆవిష్క రిస్తున్నామని నిర్మాతలు తెలిపారు. నటుడు శివాజీతో పాటు నవదీప్, నందు, బిందు మాధవి, రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య తదితరులు ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మార్క్ కె.రాబిన్ సంగీతం. వెంకట్ ఆర్.శాఖమూరి సినిమాటోగ్రఫీ, సృజన అడుసుమిల్లి ఎడిటింగ్, క్రాంతి ప్రియమ్ ఆర్ట్ డైరెక్టర్, రేఖ బొగ్గారపు కాస్ట్యూమ్ డిజైనర్, ఎడ్వర్డ్ పేరజీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, అనీష్ మరిశెట్టి కో ప్రొడ్యూసర్. పాటలు టి సిరీస్ ద్వారా విడుదల చేయనున్నారు. అథర్వణ భద్రకాళి పిక్చర్స్ ఈ సినిమాను ఓవర్సీస్‌లో విడుదల చేయనుంది.

# 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' గ్లింప్స్



కథానాయకుడు రవితేజ నటిస్తున్న కొత్త సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఈ సినిమా నుంచి గ్లింప్స్‌ను నిర్మాతలు విడుదల చేశారు. నేను శైలజ, ఉన్నది ఒకటే జిందగీ లాంటి సినిమాలతో ఆకట్టుకున్న కిశోర్ తిరుమల ఈ చిత్రానికి దర్శకుడు. గ్లింప్స్ కామెడీగా సాగింది. రామసత్యనారాయణ (రవితేజ)ని అతడి జీవితంలోని ఇద్దరు ఆడోళ్లు రెండు ప్రశ్నలు అడుగుతారు. ఇంతకీ ఆ ప్రశ్నలేంటి? వాటికి ఎవరూ ఎందుకు సమాధానం చెప్పలేకపోయారనేదే స్టోరీలా అనిపిస్తుంది. 'నా జీవితంలోని ఇద్దరు ఆడవాళ్లు రెండు ప్రశ్నలు అడిగారు.. సమాధానం కోసం చాలా ప్రయత్నించారు. గూగుల్, చాట్ జీపీటీ, జెమినీ, ఏఐ.. ఇలా అన్నింటినీ అడిగారు. బహుశా వాటికి పెళ్లి కాకపోవడం వల్ల ఆన్సర్ చెప్పలేకపోయాయేమో' అని రవితేజ చెప్పిన డైలాగులు ఫన్నీగా ఉన్నాయి. ఇందులో ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. భీమ్స్ సంగీతం. వచ్చే సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానుంది.



## తమిళనాడుకు
# ఆంధ్ర ఝలక్

### అభిషేక్, కరణ్ షిండే అర్ధసెంచరీలు
### రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్



**విశాఖపట్నం:** రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-ఎలో తమిళ నాడుపై ఆంధ్రప్రదేశ్ జట్టు ఘన విజయం సాధించింది. తమిళనాడు జట్టు నిర్దేశించిన 201పరుగుల లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 6వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ అభిషేక్ రెడ్డి(70), కరణ్ షిండే(51) అర్ధసెంచరీలకి తోడు లోయర్ ఆర్డర్‌లో అశ్విన్ హెబ్బర్(21), సత్యనారాయణ(20) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. తొలి ఇన్నింగ్స్‌లో తమిళనాడుకు 5పరుగుల స్వల్ప ఆధిక్యత లభించినా.. ఓవర్‌నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 102పరుగులతో మూడోరోజు ఆటను కొనసాగించిన తమిళనాడును ఆంధ్ర బౌలర్లు కట్టడి చేశారు. సౌరభ్ కుమార్(4/46)కి తోడు విజరు, పృథ్వీరాజ్ రెండేసి వికెట్లతో రాణించారు. దీంతో తమిళనాడు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 195పరుగులకే పరిమితమైంది. దీంతో ఆంధ్ర జట్టు 201పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. ఈ గెలుపుతో ఆంధ్ర ఖాతాలో మరో మూడు పాయింట్లు జమ అయ్యాయి. పాయింట్ల పట్టికలోనూ 2వ స్థానానికి ఆంధ్ర ఎగబాకింది.

## పంత్, జురెల్‌కు చోటుపై
# కోచ్, కెప్టెన్ మల్లగుల్లాలు

### - పంత్, జురెల్‌కు చోటుపై - కోచ్, కెప్టెన్ మల్లగుల్లాలుపంత్, జురెల్‌కు చోటుపై కోచ్, కెప్టెన్ మల్లగుల్లాలు - 14 నుంచి దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్



**ముంబయి:** దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ సిరీస్‌కు రిషబ్ పంత్, ధృవ్ జురెల్‌లకు చోటు కల్పించడంపై టీమిండియా కోచ్, కెప్టెన్ మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగే తొలి టెస్ట్‌లో వీరిద్దరూ ఆడతారని, వీరిద్దరి చోటు కల్పిస్తే ఎవరెవరిని బెంచ్‌కి పరిమితం చేయాలనే అంశంపై వీరు సుదీర్ఘ చర్చలు జరుపుతున్నట్లు మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. వీరిద్దరూ వికెట్ కీపర్ కోటాలో పోటీపడుతుండడమే ఇందుకు ప్రధాన కారణం. దక్షిణాఫ్రికా-ఎతో జరిగిన రెండో అనధికారిక టెస్ట్‌లో వీరిద్దరూ ఫామ్‌లోకి సెంచరీ, అర్ధసెంచరీలతో రాణించారు. వికెట్ కీపర్, వైస్ కెప్టెన్ హెూదాలో రిషబ్ పంత్‌కు తొలిటెస్ట్‌లో చోటు దక్కవచ్చని, కానీ దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో రాణించిన జురెల్‌కు తప్పక చోటు దక్కాలని తాను కోరుకుంటున్నానని ఆకాశ్ చోప్రా తెలిపాడు. వీరికి చోటు కల్పించాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తే.. సాయి సుదర్శన్, నితీష్‌కుమార్ రెడ్డిలలో ఒకరు బెంచ్‌కే పరిమితం కావాల్సి ఉంటుంది. 3వ స్థానంలో బ్యాటింగ్‌కు సాయి సుదర్శన్ సరిపోతాడని, లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు మాత్రమే నితీశ్ కుమార్ రెడ్డి ఉపయోగడపతాడని, ఈ క్రమంలో తాను సాయి సుదర్శన్ తొలి టెస్ట్ ఆడాలని కోరుకుంటున్నానని తెలిపాడు.

**టి20 ప్రపంచకప్‌కు సన్నద్ధం కండి: గంభీర్**

భారత్ వేదికగా జరిగే టి20 ప్రపంచకప్‌కు ఆటగాళ్లు సన్నద్ధం కావాలని టీమిండియా కోచ్ గౌతం గంభీర్ ఆటగాళ్లకు దిశా నిర్దేశం చేశాడు. ఇంకా మూడు నెలల సమయం మాత్రమే మిగిలిఉందని, ఆటగాళ్లు ప్రపంచకప్ కోసం పూర్తిగా సన్నద్ధం కావాలని, ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలని ఆటగాళ్లకు పలు కీలక సూచనలు చేశాడు.
కోచ్ గౌతం గంభీర్ మాట్లాడిన వీడియో క్లిప్‌ను బిసిసిఐ సోమవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. 'మా డ్రెస్సింగ్ రూం పారదర్శకంగా ఉంది. దాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్నాం. టి20 వరల్డ్ కప్ కోసం పూర్తిగా సన్నద్ధం కావాల్సి ఉంది. మన చేతిలో ఇంకా మూడు నెలల సమయం మాత్రమే ఉంది. ఫిట్‌నెస్ ప్రాముఖ్యాన్ని ఆటగాళ్లంతా అర్థం చేసుకుంటారనుకుంటున్నా' అని గంభీర్ సూటిగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. భారత్, శ్రీలంక వేదికలుగా 2026 ఫిబ్రవరిలో టి20 వరల్డ్ కప్ జరగనుంది.

**అహ్మదాబాద్‌లో ప్రారంభ, ఫైనల్ మ్యాచ్‌లు**

టి20 ప్రపంచకప్ ప్రారంభ, ఫైనల్ మ్యాచ్‌లు అహ్మదాబాద్‌లో జరగనున్నట్లు సమాచారం. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఈ రెండు మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు ఇప్పటికే ముమ్మరంగా సాగుతున్నాయి. పాకిస్తాన్ జట్టు ఫైనల్‌కు చేరితే మాత్రం వేదిక మారడం ఖాయం. అలాగే సెమీఫైనల్ మ్యాచ్‌లు ముంబయిలోని వాంఖడే స్టేడియం, కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతాయని, ముంబయిలో రెండో సెమీస్, కోల్‌కతాలో తొలి సెమీస్ పోరు జరుగుతుందని బిసిసిఐ సూచన ప్రాయంగా తెలియజేసింది. పాకిస్తాన్, శ్రీలంక జట్లు తొలి నాలుగు స్థానాల్లో నిలిస్తే ఒక సెమీస్ కొలంబోలో జరుగుతుంది. ఫిబ్రవరి 7నుంచి మార్చి 8వరకు టి20 ప్రపంచకప్ జరగనున్నట్లు సమాచారం.

# స్కానింగ్ కేంద్రాలపై గట్టి నిఘా చర్యలు తీసుకోవాలి

## గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్





**అనంతపురం కలెక్టరేట్, సూర్య వాస్తవం, నవంబర్ 10:** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా క్షేత్రస్థాయిలోఅమలుచేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పి.సి, ఎన్ డి టి యాక్ట్ ( గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం) అమలుపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రిఎట్ అథారిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోప్రస్తుతం ఉన్న 185 స్కానింగ్ సెంటర్ పని తీరు పై గట్టి నిఘాచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా బాల్య వివాహాలపై అవగాహనతోపాటులింగనిర్ధారణ నేరమనీ తెలియజేస్తూ విస్తృతంగా ప్రజల్లోఅవగాహన కార్యక్రమాలు కల్పించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలోని ఆరోగ్యశాఖ సిబ్బంది ,పోలీసు,న్యాయశాఖ అధికారులు, మరియు స్వచ్ఛంద సేవాసంస్థలు, సమన్వయంతో పని చేయాలని గర్భస్థలింగ నిర్ధారణ గురించి సమాచారం అందించాలన్నారు. స్కానింగ్ కేంద్రాలపై నిరంతర గట్టి నిఘా ఉంచి చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ చేసే ఆయా కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. స్కానింగ్ కేంద్రాలలో ప్రభుత్వ నిబంధనలో ఉల్లంఘించినట్లు తనిఖీలలో రుజువైతే ప్రభుత్వ నియమ నిబంధన మేరకు కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో ఏ ఆడపిల్ల కూడా పుట్టకముందే చనిపోకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పది సూత్రాలలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ, గంజాయి డ్రగ్స్ నివారణఎంతోముఖ్యమైనవని అలాగేచట్టరీత్యాలింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా సరిహద్దుల్లో కర్ణాటక ప్రాంతానికి దగ్గరగా ఉన్న గ్రామాలలో కూడా గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. డేకాయ్ ఆపరేషన్లను నిర్వహించాలని, ఇంటలిజెంట్ రింగ్ నివేదిక అందించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా ప్రణాళిక బద్ధంగాచర్యలుతీసుకోవాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే అలాంటివారిపైచర్యలుతప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. అనంతరంజిల్లాలోపనిచేస్తున్న సహాయ పునరుత్పత్తి కేంద్రాల పనితీరుపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఆడపిల్లల ప్రాముఖ్యత వారి చదువు సాధికారతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశాలలో డి ఎం హెచ్ ఓ డా. ఈ. బి.దేవి, స్త్రీ వైద్య నిపుణులు డా. శంషాద్ బేగం, ఆర్డిటి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డా. దుర్గేష్, రెడ్స్ భానుజా, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి

## నాణ్యతే ప్రామాణికంగా అర్జీల పరిష్కారం - 377 అర్జీల స్వీకరణ - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్






**అనంతపురం, సూర్య వాస్తవం, నవంబర్ 10:** నాణ్యతే ప్రామాణికంగా అర్జీల పరిష్కారం తో పాటు అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్నిశాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ సమావేశ భవనంలో ప్రతి సోమవారం జరిగే (పిజిఆర్ఎస్) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండిఅర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్‌కలెక్టర్ శివ్ నారాయణన్ శర్మ , అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డి ఆర్ ఓ మలోలా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, రామ్మోహన్, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు వివిధసమస్యలపైసమర్పించిన అర్జీలను ఆయాశాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీతగడువులోపుతప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అలాగే ఆడిట్ తప్పనిసరిగా చేయాలని, పర్ఫామెన్స్‌కి ఇండికేటర్లలో పెండింగ్ ఉన్న వాటిని వెంటనే పూర్తి చేయాలని ప్రాధాన్యత అంశాలపై సమీక్షలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అలాగే ఈనెల 17 నుండి 30వరకు క్షేత్రస్థాయిలో ఇంటింటి కుష్టువ్యాధి నిర్ధారణ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు జిల్లా వైద్యఆరోగ్యశాఖఅధికారులకు సమన్వయ సహకారాలు అందించి కార్యక్రమాన్ని విజయంతం చేయాలన్నారు. రేపటి రోజున మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మ దినోత్సవంలో భాగంగా మైనార్టీ సంక్షేమ దినోత్సవం మరియు జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని ఆయాకార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరు, పెన్షన్ ల మంజూరు తదితర అంశాలతో కూడినవినతులను సమర్పించారు. ఈ రోజు కార్యక్రమంలో మొత్తం 377 అర్జీలు రాగా వాటిపై తగు చర్యలు తీసుకొని వాటిని పరిష్కరించాలని శాఖల అధికారులకు ఆదేశించారు.





## జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా

# జీఎం సురేష్

గోరంట్ల, సూర్య వాస్తవం నవంబర్ 10: సామాజిక సేవకులు, సినీ నిర్మాతగా చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక గుర్తింపును తెచ్చుకొని చలనచిత్రాలతో పాటు షార్ట్ ఫిలింలో చిత్రీకరిస్తూ సందేశాత్మక చిత్రాలు నిర్మిస్తూ మరోవైపు పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొంది మరో కోణంలో తన సంపాదంలో కొంత భాగాన్ని పేద ప్రజల కోసం కేటాయిస్తూ కొన్ని సంవత్సరాలుగా అనేకమంది విద్యార్థులకు విద్యాసాయం, ఆలయాల నిర్మాణానికి ఆర్థిక సాయం, అనేక ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు, పేద విద్యార్థులను గుర్తించి వారికి ఫీజులు కట్టి చదివించడం ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న నేపథ్యంలో జిఎం సురేష్ సేవలను గుర్తించిన రెడ్ క్రాస్ సొసైటీ రెడ్ కార్పెట్ వేస్తూ జిల్లా చైర్మన్ గా ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు ,పుట్టపర్తి జిల్లా కేంద్రంలో ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమాలు నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా వచ్చిన రాష్ట్ర అబ్జర్వర్ గా రవి ప్రకాష్ హాజరయ్యారు.

**నూతన కమిటీ ఎన్నిక..**

పుట్టపర్తి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గని ఎన్నుకున్నారు. కమిటీ ముఖ్య ఆహ్వానితునిగా జిఎం సురేష్, విశ్వనాథ్ మరియు జిల్లా కార్యదర్శులుగా కొనసాగించడానికి కమిటీ తీర్మానం చేశారు ,ఈ నేపథ్యంలో జిల్లా చైర్మన్ గా జీఎం సురేష్, జిల్లా కార్యదర్శిగా విశ్వనాథ్, వైస్ చైర్మన్‌గా పెదరాసు భక్తవత్సలం, కోశాధికారిగా కుమారస్వామి రెడ్డి, సభ్యులుగా జగదీష్, సల్మాన్ రాజు, డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ వెంకటరమణ, శివ శంకర్ రెడ్డి, మల్లికార్జున, కిషోర్ బాబు, సంజీవ లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సిఎస్ జిల్లా కోఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను బీజేపీ నాయకులు బొట్టు శ్రీనివాసులు, మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ తదితరులు ఘనంగా సన్మానించారు.




# మొక్కజొన్న కానుగోలు త్వరలో ప్రారంభం

- మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారన్న డీసీఎంస్ చైర్మన్ నాగేశ్వర్ రావు యాదవ్

**కర్నూల్, సూర్య వాస్తవం, నవంబర్ 10:** కర్నూల్ కి విచ్చేసినా వ్యవసాయ, సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని మర్యాద పూర్వకముగా కలిసిన పుష్పగుచ్ఛమిచ్చిన కర్నూలు డీసీఎంస్ చైర్మన్ రాష్ట్ర బీసీ సంగం అధ్యక్షులు జాతీయ బీసీ సంక్షేమ సంగం అధ్యఅధ్యక్షులుక్షులు నాగేశ్వర్ రావు యాదవ్ మొక్కజొన్న కానుగోలు గురించీ చర్చింను జరిపారు సాణుకులంగా స్పందించిన మంత్రి ఆర్థిక శాఖ కమీషనర్ గారితో చర్చించి త్వరలో కానుగోలు చేస్తామని తెలిపారు.అలాగే బీసీల సమస్యలను గురించి మంత్రితో చర్చించారు






PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854